క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను నేడు (మంగళవారం) ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 వాహనాలను వేలం పాట చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వాహనాల వేలం పాటకు హాజరయ్యే ఆసక్తి గల వ్యక్తులు 50 శాతం డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

జాతరను విజయవంతం చేయాలి



కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలో జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరను విజయవంతం చేయాలని మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పాడెం శోభన్ పిలుపునిచ్చారు. సోమవారం గ్రామంలోని సమ్మక్క సారలమ్మ దేవర గుడి ప్రాంగణంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగే వనదేతల జాతర తేదీలతో కూడిన పోస్టర్‌ను పూజారులు, వడ్డెలు, గ్రామస్తులు, యువకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో దేవర బాల సుధాకర్, గ్రామస్తులు జాడి రాంబాబు, కావిరి చిన్నకృష్ణ, కావిరి సుధాకర్, ఆశ రెల్లి బైరేష్, దుర్గం రాజుకుమార్, సాంబశివ రావు, పోలయ్య పాల్గొన్నారు

వృద్ధాశ్రమంలో అన్నదానం



మంగపేట : మండల కేంద్రంలోని కస్తూరి బాయి వృద్ధాశ్రమంలో కమలాపురంలోని గోదావరి ఒడ్డు ప్రాంతానికి చెందిన బండారి సుభద్ర, స్వామి దంపతుల కుమారుడు రాజేష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం వృద్ధులకు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ తల్లిదండ్రులు మాట్లాడుతూ మీ అందరి ఆశీర్వాదంతో పరలోకంలో ఉన్న తన కుమారుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కొమరగిరి సామ్రాజ్యం, రాజేష్ బాబాయ్, పిన్ని రౌతు వెంకటేశ్వర్లు, బుజ్జి దంపతులు కుటుంబ సభ్యులు జ్యోతి, సదానందం, గీతాంజలి, ప్రవీణ్, రోహిత్, చందు, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన



మంగపేట : మండలంలోని 25 గ్రామపంచాయతీల పరిధిలోని 14 ఎంపీటీసీ స్థానాల ఓటర్ల జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బానోత్ భద్రు ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల్లో భాగంగా మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలు, జెడ్పీటీసీ పరిధిలోని 39,689 ఓటర్ల జాబితా సమాచారం ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్, ఎంపీఓ మమత పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ అండ



ఎస్‌ఎస్‌తాడ్వాయి : బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎంపీటీసీ ఇర్సవడ్ల భవాని నారాయణ, మాజీ సర్పంచ్ బెజ్జూరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బీరెల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన వట్టం సరస్వతీ కుటుంబాన్ని నాయకులు సోమవారం పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు కాంగ్రెస్ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సరస్వతీ కుటుంబానికి సాయం అందించామన్నారు. పరామర్శించిన వారిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మొక్కటి కోటేశ్, నాయకులు వంగారి సదానందం, కాశీశ్వరం వీరాచారి, వెంకటేశ్వర్లు, లింగాచారి, సాంబశివరావు, రమేష్, బాబు, బెజ్జూరి వెంకన్న, సత్యనారాయణ, సాంబయ్య ఉన్నారు.

బియ్యం అందజేత

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెంలో ఇటీవల గుండెపోటుతో దుర్గం భానక్క మృతి చెందింది. వారి కుటుంబాన్ని మండల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జాడి రాంబాబు ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి బియ్యం అందజేశారు.

జనపనార బ్యాగులతో ఉపాధి

- గిరిజన మహిళలకు ప్రత్యేక శిక్షణ
- స్వయంగా ఎదిగేందుకు ఐటీడీఏ, ఆర్‌ఎస్‌ఈటీఐ



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ తాడు

ఏటూరునాగారం: గిరిజన మహిళలను స్వయంగా ఎదిగేందుకు ఐటీడీఏ, ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ ప్రత్యేక జనపనార బ్యాగుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. చదువుకొని వంటింటికి పరిమితమై నిరుద్యోగంతో ఇబ్బంది పడుతున్న 35 మంది ఆసక్తి గల మహిళలను ఎంపిక చేసింది. దీంతో 13 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మొదలుపెట్టగా ఈనెల 16 వరకు కొనసాగుతోంది. ఎస్‌బీఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమ్‌మెంట్ ట్రెనింగ్ (ఆర్‌ఎస్‌ఈటీ) ద్వారా ఉచిత శిక్షణ, భోజనం కల్పించగా ఐటీడీఏ వైటీసీ కేంద్రాన్ని వసతిగా కల్పించింది.

స్వయం ఉపాధికి దోహదం

ప్రస్తుత సమాజంలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువ కావడంతో అనేక క్యాన్సర్లు పుట్టుకొస్తున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకుల సహకారంతో కూరగాయలు తెచ్చుకునేందుకు, వాటర్ బాటిల్స్, పిల్లల లంచ్ బాక్స్‌లతో పాటు ఇతర వస్తువులను అతి సులభంగా మోసుకునే విధంగా ఈ బ్యాగులను కుట్టిస్తున్నారు. ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ వారు జనపనార క్లాత్, మిషన్లు, దారాన్ని సమకూర్చా రు. అంతేకాకుండా శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లతో పాటు ఎస్‌బీఐ, ఐటీడీఏ ద్వారా ఉపాధి రుణాలు కూడా ఇప్పించేందుకు కృషి చేయనున్నా రు. దీంతో గిరిజన మహిళలు స్వయంగా ఎదిగేందుకు దోహదపడుతుంది.

ఐటీడీఏ సహకారం అందించాలి



శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఉపాధి కల్పించేందుకు ఐటీడీఏ సహకరించాలి. బ్యాంకు ద్వారా రుణాలు అందజేస్తే జనపనార బ్యాగుల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసుకొని మరికొంత మందికి ఉపాధి ఇస్తాం.

– పెనక వర్షిత, పూనుగొండ్ల, కొత్తగూడ

ఆసక్తిగా ఉంది



జనపనార బ్యాగుల తయారీ వల్ల మాకొక ఉపాధి లభించింది. వీటి ద్వారా స్వయంగా తయారు చేసి మా గూడెం ప్రజలకు, ఇతర ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాం.

– గీత, ఏటూరునాగారం గొత్తికోయగూడెం

మహిళలకు మంచి అవకాశం



మహిళలకు మంచి అవకాశం ఈ జనపనార బ్యాగుల తయారీ. రాబోయే రోజుల్లో ప్లాస్టిక్ నివారణ జరుగుతుంది. వస్తువులను తీసుకెళ్లడానికి ఈ బ్యాగులు ఎంతో ఉపయోగపడుతాయి. మరింత ఆదరణ పెరుగుతుంది.

– తాడు, ట్రైనర్, ఎస్‌బీఐ,ఆర్‌ఎస్‌ఈటీఐ

బీఆర్‌ఎస్ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చెర్‌పర్సన్ బడే నాగజ్యోతి



మాట్లాడుతున్న బడే నాగజ్యోతి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అమలు గాని ఆరు గ్యారంటీలు 420 హామీలను గ్రామాల్లో ప్రజల్లో ఎండగట్టాలన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు దుర్గం రమణయ్య, దిడ్డి మోహన్‌రావు, కాక లింగయ్య, రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, రేగ నర్సయ్య, ముంద్రతి రాజమౌళి, పాయం నర్సింగారావు, కొండూరి నరేష్ , మహిళా అధ్యక్షురాలు సోమా నాగమ్మ, జాగృతి అధ్యక్షురాలు పుర్రి స్వరూప, మహిళా నాయకురాలు విజయ, యూత్ అధ్యక్షుడు కోట సురేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బందెల తిరుపతి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటి ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న మహబూబాబాద్ కమిటీ సభ్యులు

గోవిందరావుపేట: ప్రతి మానవుడు తాను చేసిన కర్మ ప్రతిఫలాన్ని తప్పక అనుభవిస్తాడని కర్మయాగం విశిష్టత గురించి తెలియజేసేది త్రైత సిద్ధాంత భగవద్గీత మాత్రమేనని హిందూ జ్ఞానవేదిక మహబూబాబాద్ కమిటీ అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. మండలంలోని మచ్చాపూర్‌లో ఇంటింటికి తిరుగుతూ త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరుల స్వామి రచించినటువంటి త్రైత్త సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథములను మాఘ మాసం ప్రత్యేకతను పురస్కరించుకొని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ మాఘమాసం శుక్ల చతుర్దశి రోజు శివరాత్రిగా నిర్ణయించారని, పూర్వం నిరాకార పరమాత్మకు గుర్తుగా గర్భగుడి, అవసరం లేని నిరాకార పరమాత్మకు గుర్తుగా ఈశ్వర లింగం అని అన్నారు. అలాగే మాఘపూర్ణిమ భగవంతుని జన్మను తెలియజేస్తుందని, సాకార భగవంతుడుకి గర్భగుడి ఉంటుంది అని, సప్త నాడీ కేంద్రాలు గోపురంలోని 7 ద్వారాలు గా ఉన్నవి అని, రథ సప్తమి పండుగ తెలియజేస్తుంది అని అన్నారు. దేవాలయాలు సగుణోపాసన, నిర్గుణోపాసన వ్యత్యాసాలను కలిగి ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా భగవద్గీత జ్ఞానబోధ సంబంధిత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లలిత, సుష్మ, హేమలత, స్వరూప, రేఖ, కృష్ణ, కాలయుక్తి, ఈశ్వర్, సుజాత వీరస్వామి, వంశీ కృష్ణ, వీరలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక సొసైటీల ద్వారా లబ్ధి చేకూరాలి

- ఆదివాసీ నాయకుడు బుచ్చయ్య



మాట్లాడుతున్న బుచ్చయ్య

వాజేడు : ఇసుక క్వారీల మూలంగా ఏజెన్సీలోని గిరిజనులకు లబ్ధి చేకూరాలని అలా కాకుండా ప్రభుత్వం లబ్ధి పొందుతూ గిరిజనులకు అన్యాయం చేస్తుందని ఆదివాసీ నాయకుడు టింగ బుచ్చయ్య ఆరోపించారు. సోమవారం ఇసుక క్వారీల సొసైటీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చెసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏజెన్సీలో ఇసుక క్వారీల కోసం గిరిజన సొసైటీలను డీఎల్‌ఎస్‌సీ పద్ధతిలో ఏర్పాటు చేసిన సమయంలో ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.650 వస్తే అందులో గిరిజన సొసైటీకి రూ.450, ప్రభుత్వానికి రూ.200 వెళ్లేవి. దీంతో గిరిజనులకు, గిరిజన గ్రామాలకు ఆదాయం వచ్చేది. కాని గత రెండేళ్లుగా ఇకోసెన్సిటివ్‌జోన్(ఈఎల్‌జెడ్) ఏర్పాటు చేయడం మూలంగా గిరిజనుల ఆదాయానికి భారీగా గండి పడిందన్నారు. ఈ పద్ధతిలో వస్తున్న ఆదాయం రూ.650 కాగా అందులో గిరిజనులకు రూ.220 ఇస్తూ ప్రభుత్వం రూ.430 తీసుకుంటున్నట్లు ఆరోపించారు. ఈ పద్ధతిని మార్చాలని గతంలోలా డీఎల్‌ఎస్‌సీ పద్ధతిని కొనసాగించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా క్యూబిక్ మీటర్‌కు కట్టే సీనరేజిని పెంచాలని కోరారు. అదే విధగా ప్రభుత్వం ఇసుకకు కొత్త పాలసీని తీసుకొస్తే అది కూడా ఏజెన్సీలోని గిరిజనులకు లబ్ధిని చేకూర్చేలా ఉండాలని కోరారు. సమావేశంలో చింత పూర్ణ చందర్‌రావు, పీర్ల సాంబశివరావు, పెద్ది జగపతి, లొడిగె నర్సింహరావు, పెద్ది తారావు, కుర్సం నర్సింహరావు ఉన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం



వాజేడు : స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కరాటే బెల్ట్‌లను అందుకున్నారు. ఆదివారం వెంకటాపురం(కె) మండల పరిధిలోని కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ గ్రౌండ్‌లో సూర్యా సూడో కాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వాజేడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు కరాటే గ్రాండ్ మాస్టర్ బ్లాక్ బెల్ట్ పాయం సురేష్ చేతుల మీదుగా బెల్ట్‌లను అందించారు. సింధుకూరి మహేష్, పెనుమల్ల సీతారామ చంద్రారెడ్డి (బ్లూ బెల్ట్), అరికెళ్ల సాత్విక్ తేజ, బిల్లా రిషిభరత్ (ఎల్లో బెల్ట్) పొందారు. వీరికి ప్రశంసపత్రాలు ఇచ్చారు.

ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఇసుక క్వారీలు

- జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి



మాట్లాడుతున్న సాయి

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక దళారీ వ్యవస్థను నిర్మూలించాలని, ఏజెన్సీ చ ట్టాలకు విరుద్ధంగా ఇసుక క్వారీలు చేస్తున్నట్లు జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టాల పేరుతో భారీ అక్రమాలకు దారి తీస్తోందన్నారు. ఆదివాసీ గ్రామాల్లో ఇసుక క్వారీలు ఫైల్ చేస్తూ (డీఎల్‌ఎస్సీ) నిర్వహించకుండా ఇసుక ర్యాంపుల కార్యనిర్వహణలు జరుపుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు సైతం ఏజెన్సీ ప్రాంత చట్టాలను పాతర వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటూరునాగారం (ఐటీడీఏ) వ్యాప్తంగా పట్టా భూముల పేర్లతో అక్రమంగా ఇసుక క్వారీలకు అనుమతులు ఇస్తున్నారని, ఇప్పటివరకు పట్టా భూముల్లో ఇసుక మేటలను తొగించి ఎంత భూమి సాగు చేశారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులు ప్రతాప్, నరేష్, చంటి, రవి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వెంకటాపురం (కె) : స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న విభేదాల నేపథ్యంలో సోమవారం ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన అధికారులకు మండల సీఐటీయూ నాయకులు కుమ్మరి శ్రీను ఆధ్వర్యంలో పలు డిమాండ్లపై వినతిపత్రం సమర్పించారు, అంగన్‌వాడీ సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీలు ఉన్నచోట ఉపాధ్యాయులను నియమించాన్నారు. ఆయాలు లేని చోట ఆయాలను నియమించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడీలకు శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు సడాలు, భిక్షపతి, రత్నకుమారి, పాల్గొన్నారు.

మల్లంపల్లిలో ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ములుగు రూరల్ : మండలంలోని మల్లంపల్లి గ్రామంలో సోమవారం 2004–05లో పదో తరగతి చదివిన విద్యార్థులు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు రెండు దశాబ్దాల కిందట తాము చదువుకున్న పాఠశాలలో ఒకే వేదికపై కలుసుకోవాలన్న ఆలోచనతో వారం రోజుల నుంచే పూర్వ విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకున్నారు. తమకు విద్య బోధించిన గురువులకు మెమెంటోలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అప్పటి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో చదివిన తోటి విద్యార్థి మరణించిన స్వామి కుటుంబానికి తమ వంతు కృషిగా ఆర్థికసాయం అందించిన పరిపూర్ణాచారి, సునీల్, సతీష్, పాపరావు గార్లను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రేగొండ: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 36 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 12 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి, ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ వెంకటనారాయణ, పీయూ మేనేజర్ బత్తిని శ్రీనివాస్, క్షేత్ర సిబ్బంది లంసాని రమాదేవి, సాదు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ



కారుణ్యకు ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

గోవిందరావుపేట: భౌతిక రసాయనశాస్త్రం టాలెంట్ టెస్ట్‌లో జెడ్పీహెచ్‌ఎస్ చల్వాయి విద్యార్థిని డి.కారుణ్య ప్రతిభ కనబర్చింది. ములుగు జిల్లా బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం జిల్లా స్థాయిలో విద్యార్థులకు భౌతిక రసాయన శాస్త్రం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో మండల పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్ చల్వాయిలో పదో తరగతి చదువుతున్న కారుణ్య తన ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించింది. కారుణ్యను హెచ్‌ఎం కె.మల్లారెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చంద్రారెడ్డిలు, గ్రామస్తులు అభినందించారు. హెచ్‌ఎం మల్లారెడ్డి మాట్లాడుతూ కారుణ్య భౌతిక రసాయన శాస్త్రంలో జిల్లా స్థాయిలో ప్రతిభను కనబరిచి పాఠశాలకు ఘనతను తీసుకొచ్చిందన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన కారుణ్యను ఉపాధ్యాయులు అభినందించారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటివద్ద రోదిస్తున్న బాధితురాలు సమ్మక్క

మంగపేట: మండలంలోని తిమ్మంపేట నేతకాని వాడకు చెందిన గాందెర్ల సమ్మయ్య, సమ్మక్క దంపతులకు చెందిన పూరిల్లు అగ్ని ప్రమాదంలో సోమవారం పాక్షికంగా దగ్ధమైంది. దీంతో రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. సమ్మయ్య, సమ్మక్క దంపతులు గ్రామానికి చెందిన ఓ రైతు వరి పొలంలో కలుపు తీసేందుకు కూలీ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇల్లు కాలిపోతున్న విషయాన్ని కాలనీవాసులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే ఇంటి వద్దకు చేరుకునే సమయానికి ఇరుగు పొరుగువారు ఇళ్లల్లోని బిందెలతో నీటిని తీసుకువచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నిం చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో అప్పటికే ఇంటి పైకప్పు, ఇంట్లోని బీరువా అందులో దాచి ఉంచిన రూ.20 వేలనగదు, వంట సామగ్రి, బియ్యం, గృహోపకర వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయని తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేశారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద బియ్యం, వంట సామగ్రిని పంపిణీ చేశారు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం ఢీ.. ఇద్దరికి గాయాలు

వాజేడు : మండలంలోని కొప్పుసూరు గ్రామం వద్ద రోడ్డుపై నడిచివెళ్తున్న వ్యక్తిని సోమవారం ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఘణపురం గ్రామానికి చెందిన మొడెం ఆదినారాయణ నడిచి వెళ్తుండగా కొప్పుసూరుకు చెందిన రొడ్డ కృష్ణ ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఇద్దరు కింద పడిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వచ్చిన 108 సిబ్బంది ఈఎంటీ రాజేశ్వరి, పైలెట్ రాధాస్వామి ఇరువురిని ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తరలించారు.

కల్వర్టులో పడి ఒకరికి..

ములుగు: జిల్లా కేంద్రంలోని బండారుపల్లి క్రాస్ నుంచి జీవంతరావుపల్లి క్రాస్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తెలంగాణ హబ్ సమీపంలో ఇంటర్నల్ డ్రెయినేజీ కల్వర్టును నిర్మిస్తున్నారు. సోమవారం సాయంత్రం జీవంతరావుపల్లికి చెందిన దుంగుల మల్లయ్య జిల్లా కేంద్రానికి పనిపై వచ్చిన ఆయన పని పూర్తి చేసుకుని ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన వాహనం లైటు వెలుతురు కారణంగా తడబడి కల్వర్టులో పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై రామకృష్ణ మల్లయ్యను కల్వర్టు నుంచి బయటకు తీసి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

24న ‘మార్కెట్ సంఘం’ ఎన్నికలు

- 13 నుంచి 14 వరకు, నామినేషన్ల స్వీకరణ
- 16న పరిశీలన, 17న ఉపసంహరణ



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శైలజ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం గిరిజన కోఆపరేటివ్ మార్కెట్ సంఘం ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం అథారిటీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం డిప్యూటీ రిజిస్ట్రార్ శైలజను ఎన్నికల సంఘం అధికారిగా సోమవారం నియమించారు. ఈ సందర్భంగా ఆమె మహదేవపూర్ కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికలను రహస్య బ్యాలెట్ ప్రకారం నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికలు నిర్వహించే పాలవర్గాల స్థానాలు 5 కాగా జనరల్ 3, మహిళ 2గా కేటాయించినట్లు పేర్కొన్నారు. నామినేషన్ ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ.500, బీసీలకు రూ.700, ఓసీలకు రూ.1000 చొప్పున ఖరారు చేసినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ఈనెల 13 నుంచి 14 వరకు, నామినేషన్ పత్రాల పరిశీలన 16న, ఉపసంహరణ 17న, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా, గుర్తులు 17న సాయంత్రం 5 గంటల తర్వాత ప్రకటిస్తారని తెలిపారు. పోలింగ్ 24వ తేదీ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. మహదేవపూర్, కాటారం, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాల గిరిజనులు పాల్గొంటారని, సభ్యత్వం కలిగి సంవత్సరం పూర్తయిన వారికి మాత్రమే ఓటు హక్కుల ఉంటుందని తెలిపారు. ఆమె వెంట డీఎస్‌ఓ భూక్యానాయక్ ఉన్నారు.

ఎమ్మెల్సీ నామినేషన్‌కు తరలిన నాయకులు



మల్హర్: కరీంనగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి నామినేషన్ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం కరీంనగర్‌కు తరలి వెళ్లారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌తో కలిసి నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ నామినేషన్ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కరీంనగర్‌కు తరలిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, కటకం శ్రీనివాస్‌లు ఉన్నారు.